క్లుప్తంగా

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లోని పేదలకు గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన అవర్ స్టేట్, అవర్ లీడర్ సోషల్ మీడియా గ్రూప్, ఇండియన్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం ద్వారా సేకరించిన రూ.52,003తో కొనుగోలు చేసిన 200 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.శాంతమూర్తి మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీ, సింగ్‌నగర్, ప్రకాష్‌నగర్‌లలోని వరద బాధితులకు సోమవారం నాణ్యమైన దుప్పట్లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సీఏ నాగార్జునరెడ్డి, గుంటూరు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బూసి రాజలత, ఫోరం సభ్యులు ప్రదీప్, రామకృష్ణ పాల్గొన్నారు.

నగరంపాలెం సీఐ వీరా నాయక్ బాధ్యతల స్వీకారం



లక్ష్మీపురం: గుంటూరు నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా వీరానాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ను సీఐ వీరానాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. వీరానాయక్ 2002లో ఆర్ఎస్ఐగా వీధుల్లో చేరి లా అండ్ లార్డర్ కనవర్షన్ ఎస్ఐగా ప్రకాశం జిల్లా పుల్లల చెరువులో బాధ్యతలు చేపట్టారు. అక్కడ నుంచి ఒంగోలు తాలుకా, తాడికొండ, మంగళగిరి రూరల్‌లో ఎస్ఐగా పని చేశారు. 2019లో సీఐగా పదోన్నతి పొంది గుంటూరు కంట్రోల్ రూమ్ సీఐగా బాధ్యతలు నిర్వర్తించి 2021-22 వరకు గుంటూరు తూర్పు ట్రాఫిక్ సీఐగా, బాపట్ల సీసీఎస్ , నెల్లూరు జిల్లా 6వ బాలాజీ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల బదిలీలలో ఇక్కడకు వచ్చారు.

విశ్వబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



నెహ్రూనగర్: విశ్వబ్రాహ్మణులకు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అరండల్‌పేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 30, 2018లో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రులను ఆహ్వానించి విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి, వారి ఆర్థిక సామాజిక రాజకీయ అభివృద్ధి కోసం కావాల్సిన 28 అంశాలను టీడీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 30న విశ్వబ్రాహ్మణ సమైక్య స్ఫూర్తి దినోత్సవాన్ని గుంటూరు, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం వంటి నగరాల్లో నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ఇస్తామన్న ఎమ్మెల్సీ పదవిని కేటాయించాలని, అదే విధంగా మిగిలిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని వాటిని అమలు చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు సుశీల, వీరప్రసాద్, కిరణ్, కోటేశ్వరరావు, వీర బ్రహ్మాచార్యులు, ఈశ్వరచారీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047పై విద్యార్థులకు పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: స్వర్ణాంధ్ర-2047కు అనుగుణంగా విద్యారంగంలో దార్శనిక ప్రణాళికను రూపొందించడంపై సోమవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో విద్యార్థులకు జిల్లాస్థాయిలో వ్యాసరచన, వక్తృత్వం, చర్చా పోటీలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి, గుంటూరు డీవైఈఓ పి. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఏఎంవో జయశంకర్, సీఎంఏ సుజాత పోటీలను నిర్వహించా రు. 18 మండలా ల్లోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్న పోటీలకు ఉపాధ్యాయులు బి.మంగారావు, ఓ.నాగేంద్ర, ఎం.హరీష్, జి.పాప, జి.వసుంధరా దేవి, కె.కుసుమకుమారి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

దేవాలయాలను ధార్మిక సంస్థలకు అప్పగించాలి

గుంటూరు మెడికల్: తిరుమల తిరుపతి ఆలయ పవిత్రతను కాపాడాలని, హిందూ దేవాలయాలను ప్రభుత్వం నుంచి విముక్తి కలిగించి హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించా లని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదురుగా సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. తిరుపతి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వ్యక్తులను శిక్షించాలని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న దేవాలయాలను వెంటనే విముక్తి కలిగించి హిందూ ధార్మిక సంస్థలకు అప్పగించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపికృష్ణ, విశ్వహిందూ పరిషత్ నాయకులు వెంకటప్ప రెడ్డి, జనార్ధన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, హరినాథ్, అనిల్ బెహరా, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం బాధ్యత విభాగాధిపతులే..

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇస్తున్న అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే బాధ్యత తీసుకోవాలని, అర్జీదారులకు సంతృప్తికర పరిష్కారాన్ని అందించాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం గత వారం అందిన అర్జీల పరిష్కారాలపై సమీక్ష చేస్తామని, కనుక ప్రతి అర్జీ సమగ్రంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అర్జీలు పునరావృతం కాకుండా, నాణ్యమైన పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన చెప్పారు. ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సోమవారం ప్రజల నుంచి 55 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 26, రెవెన్యూ విభాగానికి 7, ప్రజారోగ్య విభాగానికి 3, అకౌంట్స్ విభాగానికి 3, ఉపా సెల్‌కి 1, ఎన్నిల విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ. శ్యాం సుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్

20 మంది వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శులుగా పోస్టింగ్..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బీకాం క్వాలిఫైడ్ అభ్యర్థులు 20 మందికి గుంటూరు నగరపాలక సంస్థ వార్డు సచివాలయాల్లో సూపర్ న్యూమరీ పోస్టుల్లో వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులుగా అపాయింట్మెంట్ ఉత్తర్వులు అందించినట్లు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీకాం అర్హత కలిగి, వార్డు సచివాలయ కార్యదర్శుల పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై పోస్టులు దక్కని వారికి ప్రత్యేకంగా సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి పోస్టింగ్ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అందులో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థకు 34 పోస్టులు మంజూరు చేసిందని, 20 మంది అభ్యర్థులు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారని.. వారికి సోమవారం వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులుగా అపాయింట్మెంట్ ఉత్తర్వులు అందజేసినట్లు వివరించారు.

రేపు మెగా మాస్ క్లీనింగ్

స్వచ్ఛతా హి సేవలో ముగింపు కార్యక్రమాల్లో భాగంగా అక్టోబర్ 2న గుంటూరు నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో మెగా మాస్ క్లీనింగ్, అనంతరం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రజారోగ్య కార్మికులకు సన్మానం, పీపీఈ కిట్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. అక్టోబర్ 2న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ముగింపు కార్యక్రమాల నిర్వహణపై సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులు, ఇతర విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

చెరువులు వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి చర్యలు

గుంటూరు రూరల్: నగరపాలకసంస్థ పరిధిలోని చెరువులు, వాకింగ్‌ట్రాక్‌ల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కమిషనర్ సమ్మర్‌పేట చెరువు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని చెరువు కట్టలను ప్రజలకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్‌లుగా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో ఫెన్సింగ్ పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామని చెప్పారు. పర్యటనలో కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి, డీఈఈ హనీఫ్, ఎస్ఎస్ సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ పాల్గొన్నారు.

3 నుంచి పోలేరమ్మతల్లి దేవస్థానంలో శరన్నవరాత్రులు

నగరంపాలెం: శ్రీచుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఈనెల మూడో తేదీ నుంచి శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. సోమవారం దేవస్థానంలో ఉత్సవాల బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రులను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గత 20 ఏళ్ల కిత్రం ఎనిమిది మందితో ప్రారంభమైన కమిటీలో ప్రస్తుతం 86 మంది కిపైగా ఉన్నారని చెప్పారు. జిల్లాలోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అంగడి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, కాంద్రుకుంట గురవయ్య, మాజీ కార్పొరేటర్ అడకా శ్రీనివాసరావు, కుమ్మర చంద్రశేకర్, వెంపాటి సాంబిరెడ్డి, గూడూరు రామకృష్ణ పాల్గొన్నారు.



బ్రోచర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, కమిటీ సభ్యులు

ఆర్టీసీ బస్టాండ్‌లో అధికంగా పార్కింగ్ ఫీజు వసూలు

నెహ్రూనగర్: నగరంలో సిటీ బస్సులు తిప్పాలని, గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్ ఫీజు అధికంగా వసూలు చేస్తున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని గోరంట్లకు చెందిన రవీంద్రబాబు గుంటూరు- 2 డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల నుంచి డిపో మేనేజర్ ఎస్‌కే అబ్దుల్ సలాం సలహాలు, సూచనలు స్వీకరించారు. గుంటూరు, విజయవాడ వెళ్లే పల్లెవెలుగు బస్సులు మంగళగిరి పట్టణంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మంగళగిరికి చెందిన ఎన్.శివ, దాసులు డిపో మేనేజర్ దృష్టికి తీసుకొచ్చారు. గుంటూరు నుంచి కొప్పూరు గరికపూడిలకు వెళ్లే బస్సు సర్వీస్‌లు నిలిపివేశారని, తిరిగి పునరుద్ధరించాలని పెదగొట్టిపాడుకు చెందిన శ్రీహరికృష్ణ విన్నవించారు. సమస్యలను పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

యోగా, ప్రాణాయామం గుండెకు మేలు

కార్డియాలజిస్ట్ డాక్టర్ రామారావు



గుంటూరు ఎడ్యుకేషన్: యోగా, ప్రాణాయామం ద్వారా గుండె ఆరోగ్యాన్ని పదిలపరచుకోవచ్చునని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎల్.రామారావు పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా గుండె జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రామారావు మాట్లాడుతూ గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో వ్యాయామం, సమతుల్య ఆహార ప్రాధాన్యాన్ని గురించి వివరించారు. గుండె జబ్బుల నిర్ధారణకు ఈసీజీ, ఎకో, కార్డియోగ్రామ్, యాంజియోగ్రామ్ వంటి పరీక్షల అవసరాన్ని తెలిపారు. మధుమేహం, మూత్ర పిండాల సమస్యలతో పాటు బీపీతో బాధపడుతున్న వారు తప్పకుండా కార్డియాలజిస్ట్ సలహాతో చికిత్స పొందాలని సూచించారు. చికిత్సతో పాటు యోగా, ప్రాణాయామం చేయడం ద్వారా ఉపశమనం పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ప్రత్యూష, ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, ఫార్మసీ ప్రాక్టీసు విభాగాధిపతి ఎస్.హేమకుమారి పాల్గొన్నారు.

రేపు నగరంలో మాంసం విక్రయాలు నిషేధం

నెహ్రూనగర్: అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గుంటూరు నగరంలో ఎక్కడ కూడా మాంసం విక్రయాలు జరపకూడదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు సచివాలయాల వారీగా మాంస విక్రయాల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాంస విక్రయదారులు, హోటల్ యజమానులు గాంధీ జయంతి రోజున మాంస, మాంసాహార విక్రయాలు నిలిపివేసి సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రారంభమైన స్వర్ణకారుల ఓటు నమోదు ప్రక్రియ

నెహ్రూనగర్: త్వరలో నిర్వహించనున్న స్వర్ణకార సంఘం ఎన్నికలకు స్వర్ణకారులు సిద్ధంగా ఉండాలని గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్వర్ణకార ఓటు నమోదు ప్రక్రియ కార్యక్రమానికి సంబంధించి గంటలమ్మచెట్టు వీధిలోని పట్టణ స్వర్ణకారుల కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్‌లో స్వర్ణకార ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం నుంచి స్వర్ణకార ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరిగిందన్నారు. స్వర్ణకారులంతా తప్పనిసరిగా ఈ ఓటు నమోదు ప్రక్రియలో పాల్గొని నవంబర్ 11వ తేదీన జరగనున్న ఎన్నికల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల నిర్వహణ కన్వీనర్లుగా జింకా దివ్య నారాయణ, కడారు వెంకటేశ్వరరావు, నిర్వహణ కమిటీ సభ్యులుగా ధనాలకోట శ్రీనివాసరావు, చాపల సాయిబాబా, చందు శ్రీనివాస్, సంభాన వీరభద్రాచారి, షేక్ ఫిరోజ్, తిరువల్లూరు వెంకటరమణలు వ్యవహరించనున్నారని చెప్పారు.

మత రాజకీయాలు మానుకోవాలి

లక్ష్మీపురం: భారీ వర్షాల కారణంగా గుంటూరు నగరం అస్తవ్యస్తంగా తయారైందని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోని నగర సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. స్థానిక ఏటీ అగ్రహారం 30వ డివిజన్ సీపీఐ శాఖ సమావేశం 12వ లైన్‌లో శాఖా కార్యదర్శి చిన్న అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. తిరుపతి లడ్డు కల్తీ విషయంలో మత రాజకీయాలు చేస్తుందని అన్నారు. ఒకవేళ లడ్డు కల్తీ జరిగితే సమగ్రమైన విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు రావుల అంజిబాబు, మంగా శ్రీనివాసరావు, చల్లా మరియాదాసు, నూతలపాటి చిన్న, శాఖ సభ్యులు వాసు, కె.శ్రీను, రమణయ్య, కాసిం, లూకా తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న వ్యక్తికి సత్కారం



నగరంపాలెం: పాగోట్టుకున్న పర్సుని తిరిగి అప్పగించిన వ్యక్తిని లాలాపేట పోలీసులు సోమవారం సత్కరించారు. పెదనందిపాడు మండలం కాట్రపాడు గ్రామానికి చెందిన కసుకుర్తి ఝాన్సీ ఆమె భర్తతో ఆదివారం రాత్రి గుంటూరు-కాట్రపాడుకి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు మార్కెట్ వద్ద బైక్‌కు తగిలించిన బ్యాగ్ పోయింది. అదే సమయంలో ఆటుగా వెళ్తున్న సుద్దపల్లి డొంక భగత్‌సింగ్ నగర్‌కు చెందిన షేక్ అల్లా బక్షు బ్యాగ్‌ను గుర్తించాడు. దీంతో లాలాపేట పోలీసులకు బ్యాగ్‌ను అప్పగించాడు. బ్యాగ్‌లో రూ.16 వేలు, విలువైన డాక్యుమెంట్స్ ఉన్నట్లు గుర్తించారు. నిజాయతీ చాటిన అల్లాబక్షను సత్కరించగా, బ్యాగ్‌ను ఝాన్సీకి అప్పగించారు. కార్యక్రమంలో సీఐ శివప్రసాద్, ఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

లక్ష్మీపురం: వృద్ధురాలి మెడలో ఉన్న ఆరు సవర్ల బంగారు గొలుసు లాక్కొని పరారైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్‌వీఎన్ కాలనీ 2వ లైన్‌లో రెండు పోర్షన్ల ఇంటిలో పొట్టి కాశి అన్నపూర్ణమ్మ(84) ఉంటుంది. ఆమెతో పాటు కొడుకు కొత్తపేట మెడికల్ షాపులో పని చేస్తూ ఉంటాడు. అయితే సాయంత్రం సుమారు సమయంలో కాశీ అన్నపూర్ణమ్మ ఇంటి వెనుక ఉన్న బాత్రుమ్‌లోకి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడ్డాడు. బాత్రుమ్ లైటును ఆపి ఆమె మెడలో 6 సవర్ల బంగారు గొలుసుకు తీసుకుని పరారయ్యాడు. అన్నపూర్ణమ్మ బంధువులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మధుపవన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

జేకేసీ నగర్‌లో ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఏడుగురిని సోమవారం అరెస్ట్ చేసి వీరి నుంచి రూ.27,740 నగదు, 8 సెల్ ఫోన్‌లను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు.. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కళాశాల ఎదురు ఉన్న గ్యాస్ గోదాము వెళ్లే రోడ్డులో డాక్టర్ రామ్స్ డయాబెటిక్స్ కేర్ సెంటర్ పైన మొదటి అంతస్తులో పేకాటాడుతున్నట్లు సమాచారం అందింది. సమాచారం తెలుసుకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారి వద్ద గల నగదు, సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నగరంపాలెం: చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సాయిబాబా కాలనీకి చెందిన తురకా తిరుపతమ్మ(30), తురకా వెంకటేశ్వర్లుకు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు సంతానం ఉన్నారు. గత రెండు వారాలుగా భర్త, అత్త చిన్న విషయాలకు తిరుపతమ్మతో గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపం చెందిన తిరుపతమ్మ గతనెల 23న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిపై పరస్పరం ఫిర్యాదులు

నగరంపాలెం: ఘర్షణపై పరస్పర ఫిర్యాదు చేసుకున్న ఘటన కొత్తపేట స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మందుల కొనుగోలు నిమిత్తం మంగళదాస్‌నగర్ 2వలైనుకు చెందిన షేక్ ఖాశిం, ఆర్టీసీ కాలనీకి చెందిన షేక్ జమీర్ ఆదివారం రాత్రి ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని అపోలో మెడికల్ షాపు వద్దకు వచ్చారు. ఈక్రమంలో వారి మధ్య స్వల్ప విషయమై ఘర్షణ జరిగింది. ఖాశిం ఇనుపరాడ్‌తో తనపై దాడికి పాల్పడినట్లు జమీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా జమీర్ తనపై ఇటుకరాయితో దాడికి పాల్పడినట్లు ఖాశిం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ విరమణ చేసిన కానిస్టేబుల్‌కు సన్మానం

నగరంపాలెం: ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. మంగళగిరి రూరల్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే సి.హెచ్.శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈమేరకు అతన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఘనంగా సత్కరించారు. జిల్లా ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, ఎస్‌బీ డీఎస్పీ జి.సీతారామయ్య, ఏఆర్ వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, అడ్మిన్ ఆర్ఐ బ్రహ్మానందం పాల్గొన్నారు.

శ్రీశృంగేరి శంకరమఠంలో శారదా శరన్నవరాత్రి మహోత్సవాలు

నగరంపాలెం: శ్రీశారదా శరన్నవరాత్ర మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ విష్ణుభట్ల ఆంజనేయచయనులు తెలిపారు. సంపత్‌నగర్ శ్రీశృంగేరి శంకరమఠం- శ్రీశారదా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం రాత్రి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల మూడో తేదీ నుంచి 12వ తేదీ వరకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నారని చెప్పారు. ప్రతి నిత్యం లక్ష్మీ గణపతి, దుర్గాసప్తశతి, శ్రీచక్రార్చన, పంచదశి, దేవీభాగవతం, నవగ్రహ, ఏకాదశ రుద్రాభిషేకం వంటివి జరుగుతాయని అన్నారు. మహామంత్ర అనుష్టానాలు, వేద పారాయణ, లక్ష కుంకుమార్చనలు, సాముహిక సహస్రనామ కుంకుమార్చనలతోపాటు ప్రతి నిత్యం ఆలయ ప్రాంగణంలో అమ్మవారి స్వర్ణరథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. నగరంలోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని పుణ్యఫలాలు అందుకోవాలని అన్నారు. సమావేశంలో వేద పండితులు కోట నాగరాజశర్మ, పోలిశెట్టి నాగసుందరం, పులికొండ పిచ్చయ్యగుప్తా పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన ఉర్దూ స్కూల్ విద్యార్థులు

జిల్లాస్థాయి పోటీలకు 71 మంది ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయప్రకాష్, ఉపాధ్యాయ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల ఎంపికల్లో పాత గుంటూరు నందివెలుగు రోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ బాలుర హైస్కూల్‌కు చెందిన 71 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో ఇదే ప్రథమం. ఈసందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.జయప్రకాష్ అభినందించారు. గత నెల 24, 26, 28వ తేదీల్లో గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం, టీజేపీఎస్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ హైస్కూళ్లలో జరిగిన క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారని ఆయన చెప్పారు. ట్రాక్, ఫీల్డ్ ఈవెంట్స్‌లలో అండర్-14 విభాగంలో 11 మంది, అండర్-17 విభాగంలో 12 మంది ఎంపికైనట్లు వివరించారు. అదే విధంగా ఇండోర్ గేమ్స్‌లలో చెస్ క్రీడలో అండర్-14 విభాగం నుంచి నలుగురు, యోగా అండర్-14 నుంచి ముగ్గురు, అండర్-17లో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14 విభాగంలో ఇద్దరు, అండర్-17 విభాగంలో మరో ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. కబడ్డీ అండర్-14 విభాగంలో ఏడుగురు, అండర్ 17 విభాగంలో ఆరుగురు, వాలీబాల్ అండర్-14లో ఇద్దరు, అండర్ 17లో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఖోఖో అండర్-14లో తొమ్మిది మంది, అండర్ 17లో 8 మంది చొప్పున ఎంపికైనట్లు వివరించారు. జిల్లా స్థాయి పోటీలకు అత్యధికంగా 71 మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచే ఎంపిక కావటం గర్వకారణమన్నారు. గతేడాది తమ విద్యార్థి బాలాజీ నాయక్ భువనేశ్వర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని తృతీయ స్థానం పొందారని తెలిపారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రజ్వల్, పీఈటీ ఆర్.శ్రీనివాసులు అభినందించారు.

వరద బాధితులకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: వరదల్లో సర్వం కోల్పోయి, అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారి కోసం సామాజిక బాధ్యతతో వైద్యులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జమాయతే అహలే హదీస్ సంస్థ ముందుకు వచ్చి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. ఆదివారం విజయవాడ గుంటూరు నగరంలోని వైద్యులతో పాటు రాష్ట్ర జమాయతే అహలే హదీస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లో బాధితుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సాధారణ జ్వరం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అన్ని రకాల పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ రాష్ట్ర జమాయతే అహలే హదీస్ సేవలు అభినందనీయమన్నారు. వైద్య శిబిరంలో విజయవాడ ప్రముఖ వైద్య నిపుణులు టీవీ రమణ మూర్తి, కాలేషా వలి, షేక్ అప్సర్ పాషా, గుంటూరుకు చెందిన ఖలీద్ షరీఫ్, అస్మా తన్విర్, నూరి పరి, ఆయేషా నౌరిన్, ఎల్.మోహన్ కృష్ణ, అబ్దుల్ గఫార్, శంషాద్, సాంబశివరావు, కేపీ రంగనాథ్, అడుసుమల్లి గౌతమి, ముజాహిద్, మహమ్మద్ ఫిర్దోస్ అహ్మద్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, జమాయతే అహలే హదీస్ సంస్థ ప్రతినిధులు

పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

లక్ష్మీపురం: పట్టభద్రుల ఓటరు నమోదు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ సోమవారం నుంచి నవంబర్ 6వ తేదీ వరకు అవకాశం కల్పించిందని విశ్రాంత ప్రిన్సిపాల్, సాహితీవేత్త ముప్పాళ్ల ప్రసాదరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పట్ట భద్రుల ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫారం 18 అవగాహన సంస్థ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు చెఆప్పారు. డిగ్రీ సర్టిఫికేట్, ఆధార్ ఫొటో స్టాట్‌లు, పాస్ పోర్ట్ ఫొటోలతో వచ్చి ఓటరు నమోదు ఫారం పూర్తి చేయాలన్నారు. అనంతరం పలువురికి ఫారం18 పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, వి.వి.రావ్, చంద్రయ్య, అచ్యుత ఇందుశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రసాదరావు

ప్రకృతి వ్యవసాయం సాగును ముందుకు తీసుకెళ్లాలి

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి

కొరిటెపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే విధంగా పనిచేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రైతు శాస్త్రవేత్తలు, మెంటర్స్‌కు గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తమ గ్రామాన్ని ముందుగా ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే గ్రామంగా మలుచుకోవాలని కోరారు. రైతు శాస్త్రవేత్తలు, మెంటర్స్ గ్రామంలోని రైతులకు ఆదర్శంగా నిలవాలన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు కిరణ్మయి, బాషా, శృతి, భవానిరాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజకుమారి

జీజీహెచ్‌లో 150 పడకలతో మరో క్యాన్సర్ సెంటర్

గుంటూరు మెడికల్: పేదలకు మరింత మెరుగైన క్యాన్సర్ చికిత్సలు అందించాలనే మహోన్నత లక్ష్యంతో నాట్కో ట్రస్టు మరో 150 పడకలతో నాట్కో క్యాన్సర్ ఆస్పత్రిని ప్రారంభించేందుకు సన్నాహాలు సిద్ధం చేసింది. ఈమేరకు సోమవారం నాట్కో క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ భూమి పూజ చేశారు. పాత లాండ్రి భవనం వద్ద నూతన క్యాన్సర్ సెంటర్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ నాట్కో క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో 1500 చదరపు గజాల్లో 150 పడకలతో నూతన క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మిస్తున్నామన్నారు. లాండ్రి భవనం పూర్తిగా శిథిలం కావడంతో దాని స్థానంలో క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఈవిషయాన్ని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ప్రతిపాదించగా, కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. వారం రోజుల్లో నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నాట్కో చైర్మన్ నన్నపనేని వీసీ సహృదయంతో ముందుకు వచ్చి మరో క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి నిధులు విరాళంగా అందించారని వెల్లడించారు. మరో క్యాన్సర్ సెంటర్ నిర్మించి పేదల ప్రాణాలకు భరోసా కల్పించేందుకు ముందుకు వచ్చిన నాట్కో వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, కోఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్‌లకు సూపరింటెండెంట్ కృతజ్ఞతలు తెలిపారు. నాట్కో సమన్వయకర్త అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం నాట్కో క్యాన్సర్ ఆస్పత్రికి అదనంగా మరో 150 పడకల తో క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. నూతన క్యాన్సర్ ఆసుపత్రి అందుబాటులోకి రావడం వల్ల అనేక విభాగల రోగులకు ఆసరాగా నిలిస్తోందన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వి.శివరామకృష్ణ, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ ఆవుల విజయ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, పక్కన అశోక్‌కుమార్